■ డి. కామేశ్వరి

# కాలాన్ని వెనక్కు తిప్పకు

"మమ్మీ." ఊఁ అంది కల్యాణి. వంటపనిలో మునిగి మామూలుగా అంది.

"మమ్మీ, మమ్మీ. నీకెవరన్నా మంచి గైనకాలజిస్టు తెలుసా, ఇదివరకు నీవొకసారి ఎవరో లేడీ డాక్టరు దగ్గరకెళ్ళావు. ఆవిడ పేరేమిటి?" గొంతు తగ్గించి అడిగింది చిత్ర.

చారు పోపు వేస్తున్న కల్యాణి చటుక్కున కూతురి వైపు తిరిగి, "గైనకాలజిస్టా! ఎవరికి, ఎందుకు?" ఆశ్చర్యంగా చూస్తూ అంది. చిత్ర కాస్త కళ్ళు వాల్చి, "ఐ మిస్డ్ మై పీరియడ్స్ మమ్మీ" అంది.

ఆ మాటకు కల్యాణి గుండె ఒక్క బీట్ మిస్ అయింది. కలవరంగా "అంటే... అంటే" అంది గాబరాగా. కూతురి మొహం చూడగానే ఏదో తట్టింది ఆమెకు.

"ఐ థింక్ ఐ యామ్ ప్రెగ్నెంట్" అంది చిత్ర చాలా మామూలుగా ఉప్మా కోసం పెట్టిన జీడిపప్పు పలుకు ఒకటి నోట్లో వేసుకుంటూ.

కల్యాణి తెల్లపోతూ చూసింది. కూతురి వంక అయోమయంగా చూసింది.

"ఏమిటి, ఏం అంటున్నావు?" సరిగా వినలేదేమో నన్నట్లు, నమ్మలేనట్లు రెట్టించింది.

"ఈ నెల పీరియడ్స్ రాలేదు మమ్మీ. అనుమానం వచ్చి యూరిన్ టెస్ట్ చేయిస్తే పాజిటివ్ వచ్చింది." చిత్ర తల్లి వంక చూస్తూ అంది.

కల్యాణి కాళ్ళు వణికాయి. చటుక్కున కూర కింద ఉన్న స్టౌవ్ ఆర్పేసి, డైనింగ్ టేబిల్ దగ్గరకు వచ్చి కుర్చీలో కూలబడింది. "ఏమిటంటున్నావు? మతి ఉండే మాట్లాడుతున్నావా? ఏమిటసలు సంగతి? నిజం చెప్పు. ఇదేమన్నా ప్రాక్టికల్ జోకా!" నల్లబడ్డ మొహంతో అడిగింది కల్యాణి.

"ప్రాక్టికల్ జోకా, నీతోనా? నిన్నటి నుంచీ ఈ సంగతి నీకెలా చెప్పాలా అని భయపడి చెప్పలేదు. లేట్ అయిపోతుందని చెప్పానివాళ." ఎంబ్రాసింగ్‌గా చూస్తూ అంది.

కల్యాణి నిలువుగుడ్లేసుకుని చూసింది. 'హౌ... హౌ డజ్ ఇట్ హేపెన్?' తన గొంతు తనకే వినిపించనట్లుగా గొణిగింది.

ఏమిటా సిల్లీ ప్రశ్న అన్నట్లు చూసింది చిత్ర. "ఇట్ జస్ట్ హేపెన్డ్. దట్ బ్లడీ ఫెలో ఏం ఫరవాలేదు. ఒకసారికి ఏం కాదు. సేఫ్ పీరియడ్ అంటూ చెప్పాడు" కళ్ళొగరేస్తూ అంది.

"ఎవరు? ఎవరు వాడు? నీకెంత ధైర్యమే. ఏ జలుబో చేసిందన్నంత తేలికగా చెపుతున్నావు. ఎంత ధైర్యంగా డాక్టరు దగ్గరకెళ్ళాలని అడుగుతున్నావు." కోపంతో కల్యాణి మాటలు తడబడ్డాయి. "ఇది మీ డాడీకి తెలిస్తే పాతేస్తారు నిన్ను. ఎంతకు తెగించావు." కోపంతో మొహం ఎర్రబడిపోయింది. అసలు ఇదంతా నిజమని కల్యాణి ఇప్పటికీ నమ్మలేకపోతోంది.

ఇండియాలో ఈతరంలోనైనా ఎంత మాడర్న్‌గా, ఫార్వర్డ్‌గా పెరిగినా, ఓ అమ్మాయి వచ్చి తల్లితో ఓపెన్‌గా తాను ప్రెగ్నెంట్ అన్న విషయం అతి మామూలుగా చెప్పడం అన్నది నమ్మలేని విషయంలా జీర్ణించుకోలేకపోతోంది. ఫారెన్ కంట్రీస్‌లో, అమెరికాలో అక్కడా పిల్లలు చాలా స్వేచ్ఛగా సెక్స్ లైఫ్ నడుపుతారని, హైస్కూలు లెవెల్ నుంచి బాయ్ ఫ్రెండ్స్, డేటింగులు, విచ్చలవిడిగా తిరిగి కడుపులు, అబార్షన్లు అతి మామూలు అయిపోయాయని చదవడం, వినడం జరిగింది. కానీ, మన దేశంలో కొన్ని చోట్ల అమ్మాయిలు, అబ్బాయిలు ఫ్రీగా తిరిగినా, రహస్యంగా పెద్దలకు తెలియకుండా తిరగడం ఉంది. అక్కడక్కడా అమ్మాయిలకు అబార్షన్లు గుట్టుచప్పుడు కాకుండా తల్లితండ్రులు జరపడం లాంటివి ఉన్నాయి కానీ, ఇలా ఒక అమ్మాయి తల్లితో తాను ప్రెగ్నెంట్ అని కాస్తయినా జంకు గొంకు లేకుండా చెప్పడం, అదీ తన కూతురవడం అన్నది ఊహించలేని కల్యాణికి పెద్ద షాక్ ఇది!

"ఏమిటి మమ్మీ అలా చూస్తావు కొంపమునిగినట్టు? డాక్టర్ దగ్గరికెడితే జస్ట్ టూ మినిట్స్ జాబ్."

అప్పటికి కల్యాణి ఈ లోకంలోకి వచ్చిందానిలా లేచి కూతురి చెంప చెళ్ళుమనిపించింది. కోపంతో ఆమె మొహం ఎర్రబడిపోయింది. "నోర్ముయ్. ముందు నోర్ముయ్. ఇంకొక్క మాట మాట్లాడావంటే చంపేస్తా. ఎవడా వెధవ? ముందది చెప్పు. ఎవడు వాడు?" కళ్ళెర్రబడగా గద్దించి అడిగింది.

చెంప దెబ్బతిన్న చిత్ర రోషంగా తల్లివంక చూసింది. "ఎవడో ఒకడు. ఎవడైతే ఏం? నీవు డాక్టరు దగ్గరకు తీసుకెళతావా, లేదా? అది చెప్పు ముందు." పొగరుగా అంది.

"ఏం, వాడెవడో వాడినే తీసుకెళ్ళమనకపోయావా డాక్టరు దగ్గరకు. నా అవసరం ఏమొచ్చింది? ఇంతకు తెగించిన దానివి, ఎవడైతేనేం అన్నదానివి నాదాకా ఎందుకు ఇది. గప్‌చుప్‌గా మాకెవరికీ తెలియకుండా ఆ అబార్షనేదో నీవే చేయించుకోవాల్సింది." కల్యాణి కూతురివంక తిరస్కారంగా చూసింది.

"ఆ సందీప్‌గాడు రావడానికి భయపడి ఏడుస్తున్నాడు." 'సందీప్' పేరు చెప్పేశాక నాలిక కొరుక్కుంది. "ఎవరన్నా చూస్తే అంటూ భయపడుతున్నాడా స్టుపిడ్. డాక్టర్ అబార్షన్‌కి హజ్బెండ్ గానీ, పేరెంట్స్‌గానీ ఉండాలంది."

"ఓ, తమరు అప్పుడే అన్ని ప్రయత్నాలూ చేసే నా దగ్గరకు వచ్చారన్నమాట! ఆ సందీప్ అంటే ఆ తెల్లగా, మెడలో చెయిన్... ఆ అగర్వాల్ కొడుకేనా? వాడు నీ కోసం పుస్తకాలంటూ ఇంటికి కూడా వచ్చాడు, వాడేనా?" కోపంగా అడిగింది.

చిత్ర తలాడించింది కాస్త ఎంబ్రాసింగ్‌గా చూస్తూ.

"పట్టుమని ఇరవై ఏళ్ళు లేని మీరు చదువుకోమని కాలేజీలకు పంపిస్తే – మీకు ఇప్పటినుంచీ లవ్‌లు, సెక్స్‌లు కావాల్సి వచ్చాయా? ఉత్తి ప్రేమలూ, సెక్సేలేనా, పెళ్ళి కూడా ఏమన్నా చేసుకున్నావా? పెళ్ళెందుకు చేసుకుంటాడులే వాడు. ఈజీగా దొరికావని నీతో తిరిగాడు. వాడి అవసరం తీరాక మొహం చాటేశాడు. డాక్టరు దగ్గరకు కూడా రావడానికిష్టపడలేదంటే వాడెంత గడుసువాడో, నిన్నెలా తెలివిగా వాడుకున్నాడో అర్థం అయిందా ఇప్పటికన్నా..." కసిగా, హేళనగా అంది.

"మమ్మీ ఫర్ గాడ్ సేక్. ఇటీజ్ టూ లేట్ టూ డిస్కస్ ఆన్ దిస్. అయిందేదో అయింది. నా తప్పో, వాడి తప్పో జరిగిందేదో జరిగింది. చెప్పు నీవు హెల్ప్ చేస్తావా? నన్ను ఏదో ఏర్పాటు చేసుకోమన్నావా? ఏదో పొరపాటు జరిగింది. దానికి పెద్ద రాద్ధాంతం చేస్తున్నావు. ఇట్స్ నాట్ ఎ బిగ్ డీల్."

ఆ పొగరు, నిర్లక్ష్యం చూసేసరికి కల్యాణికి తిక్కరేగింది. "ఇంత జరిగినా నీకింకా బుద్ధి రాలేదన్న మాట! ఇట్స్ నాట్ ఎ బిగ్ డీల్. ఎస్. ఓకే! వెళ్ళు నీవేం చేసుకుంటావో చేసుకో. ఇంత చేసిన దానివి అదీ నీవే చూసుకో..." కల్యాణి కోపంగా లేచి స్టవ్ వెలిగించి కూర కలిపింది.

"బుద్ధి అంటే తప్పు చేశాను అని, మీ కాళ్ళు పట్టుకు ఏడవాలా? అలా అయితే సంతోషంగా ఉండేదేమో మీకు?" కసిగా అంది చిత్ర.

"కనీసం నీ మాటల్లో జరిగిందానికి పశ్చాత్తాపం, తప్పు చేశానన్న భావం ఉంటే నాకు కాస్తన్నా జాలి ఉండేది నీ మీద. నాట్ ఎ బిగ్ డీల్ అని అంటున్నావంటే, నీకసలు ఏం జరిగిందో, దాని పర్యవసానం ఎలా ఉంటుందోనన్న ఆలోచన కూడా లేకుండా మాట్లాడుతున్నావంటే నీవెంత మూర్ఖురాలివో తెలుస్తోంది. మన ఇండియాలో ఓ పెళ్ళికాని పిల్ల గర్భం దాల్చడమంటే దాని పరిణామాలు ఎలా ఉంటాయో నీకు తెలీదు. ఇది పైకి తెలిస్తే ఏ తలమాసిన వెధవా కూడా నిన్ను పెళ్ళాడడు. ఉత్తప్పుడు ఎంత మాడర్న్‌గా, అభ్యుదయ భావాలు పలికినా పెళ్ళి వేళకి వచ్చేసరికి వంశాలు, సంప్రదాయాలు చూస్తారు."

"పెళ్ళి కాకపోతే కొంప మునగదులే..." మొండిగా వాదించబోయింది.

"అవును, నీకు పెళ్ళవసరం ఏమిటిలే. ఇంతకు తెగించినదానివి..." కల్యాణి కోపంగా ఏదో అనబోయింది.

చిత్ర కోపంగా, "స్టాపిట్ మమ్మీ. నిన్ను హెల్ప్ అడగడం నాది బుద్ధి తక్కువ. ఏదో ఎక్స్‌ట్రార్డినరీ థింగ్... లోకంలో నీ కూతురే చేసిందన్నట్లు మాట్లాడకు. ఇట్ జస్ట్ ఎ నార్మల్ థింగ్ దట్ హేపెండ్... అమ్మాయిలు, అబ్బాయిల మధ్య ఎట్రాక్షన్ల మధ్య అప్పుడప్పుడూ ఇలాంటివి జరగడం ప్రపంచ వింతలా మాట్లాడకు. నీవు డాక్టరు దగ్గరకు తీసుకెడతావో, నన్నే వెళ్ళమంటావో త్వరగా చెప్పు." అసహనంగా అంది. కల్యాణి తిరస్కారంగా కూతురి వంక చూసింది.

"డాడీకి చెప్పి ఏం చెయ్యమంటారో అడగాలి. ఇప్పుడు ఆయన నన్ను తిట్టిపోస్తారు నిన్ను నెత్తికెక్కించుకుని పాడు చేశానని. నిన్ను నమ్మి ఇంత స్వతంత్రం ఇచ్చినందుకు నా నెత్తిమీదకు తెచ్చావు."

"ఆయనకెందుకు చెప్పడం? డాడీ అసలే ఓల్డ్ ఫేషన్... నీవే అర్థం చేసుకోనిది ఆయనెలా చేసుకుంటారు?"

"ఆయనకు చెప్పకుండా దాస్తే రేపొద్దున ఈ విషయం తెలిస్తే నా ప్రాణం తీస్తారు. నాకు మతిపోతోంది. నన్ను ఆలోచించుకోనీ అసలేం చెయ్యాలో. నాకు ఆఫీసుకు టైమైపోతోంది. పనంతా అలాగే ఉంది. నీవిక్కడ నుంచి వెళ్ళు తల్లీ." గాభరాపడ్తూ వంట పని పూర్తిచేయసాగింది.

"నీవు డాడీకి చెబితే నేనూరుకోను. నీవు హెల్ప్ చెయ్యకపోతే చెయ్యకు." విసురుగా వెళ్ళిపోయింది చిత్ర.

"ఇదుగో నీవు ముందు ఆ సందీప్‌ని ఇంటికి తీసుకురా. నేనొకసారి మట్లాడాలి వాడితో."

కల్యాణి వెనకనుంచి అరిచింది.

చిత్ర చటుక్కున వెనుదిరిగి తల్లిని మింగేసేట్లు చూస్తూ "నీవేం వాడితో మాట్లాడనక్కరలేదు. ఆ రాస్కెల్ నన్ను తప్పించుకు తిరుగుతున్నాడు. వాడితో నేను మాట్లాడను" అంటూ వెళ్ళిపోయింది.

"హుఁ... వీళ్ళ ప్రేమ, మోజు అన్నీ అప్పుడే అయిపోయాయన్నమాట." విరక్తిగా అనుకుంది. జరగబోయేది తల్చుకుంటే, ఇంట్లో రాబోయే తుపాను తల్చుకుంటే భర్తని ఎలా ఎదుర్కోవాలో తల్చుకుంటే ఆమె కాళ్ళు వణకుతున్నాయి. గుండెలు దడదడలాడుతున్నాయి.

* * *

కల్యాణి ముందునుంచీ ఆధునిక భావాలు కలిగిన యువతి. స్త్రీ స్వాతంత్ర్యం, వ్యక్తిత్వం ఆత్మాభిమానం లాంటివి ఆమెకిష్టమైన పదాలు. ఆడది మగాడికన్నా దేన్నోనూ తీసిపోదని, అవకాశం ఇస్తే అతన్ని మించి పోగలదని, ఆడది చదువుకొని తన కాళ్ళ మీద నిలబడాలని, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, తనకంటూ ఓ వ్యక్తిత్వం ఉండాలని అభిలషించేది. తన తల్లి చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం లేక తండ్రి ఏన్నన్నా పడే దుఃస్థితి లాంటిది తనకు కలగరాదని పంతం పట్టి ఏడ్చి రాగాలు పెట్టి, నిరశన వ్రతాలు చేసి, ఇంటర్‌తో చదువాపేసి పెళ్ళి చేస్తానంటే ఎదురు తిరిగి, డిగ్రీ తెచ్చుకుని, బ్యాంక్ పరీక్ష రాసి, క్లర్క్ ఉద్యోగం సంపాదించి, ఇప్పుడు ఆఫీసరు స్థాయికి ఎదిగింది. ఉద్యోగం వచ్చేవరకూ పెళ్ళి మాటెత్తనన్నమాట మీద నిలబడింది.

**"మన ఇండియాలో ఓ పెళ్ళికాని పిల్ల గర్భం దాల్చడమంటే దాని పరిణామాలు ఎలా ఉంటాయో నీకు తెలీదు. ఇది పైకి తెలిస్తే ఏ తలమాసిన వెధవా కూడా నిన్ను పెళ్ళాడడు."**

తన తరువాతి తరం - తన కూతురు తాను పడిన అవస్థలు పడరాదని, ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా బాగా చదివించింది. మంచి పొజిషన్‌లో ఉండాలని ముందు నుంచి కూతురికీ, కొడుక్కీ ఎలాంటి తేడాలు చూపకుండా పెంచాలని ఆరాటపడింది.

రామకృష్ణ పల్లెటూరిలో పెరిగినవాడు. కాస్త సంప్రదాయాల పట్టింపులున్నవాడు. దేవుడు, పూజలు, గుళ్ళూ, గోపురాలు అంటూ తిరిగే రకం. ఆడపిల్లని ఆడపిల్లగా పెంచని భార్యని దుయ్యబడుతుండేవాడు.

"దానికి చక్కగా రెండు జడలు వేసి, బొట్టు కాటుక పెట్టకుండా ఆ క్రాఫేమిటి?" "ఆడపిల్ల మగపిల్లాడితో సమంగా ఆ పరుగులు, ఆ సైకిలు తొక్కడం ఏమిటి?" "వయసొచ్చిన పిల్ల ఆ షార్ట్స్, బనీన్లు వేసుకుని మగపిల్లలతో షటిల్ ఆడుతుంది. దాన్ని నీవే పాడుచేస్తున్నావు." "వాడితో సమానంగా దానికీ మోపెడ్ కొనాలా? ఆ పాంట్లు వేసుకుని అది మగరాయుడిలా తిరగాలా?" "అబ్బాయికీ, అమ్మాయికీ ఇద్దరికీ ఇంజనీరింగ్ చెప్పించాలా? మగపిల్లాడికంటే తప్పదు. ఇది ఏ బి.ఏనో చదవచ్చు. తరువాత ఏదో చదివించవచ్చు." "ఆ మగపిల్లలని ఇంటికి రానిస్తావెందుకు? దానికి బుద్ధి చెప్పాల్సింది పోయి వాళ్ళందరికీ కాఫీలు, టీలు పోస్తూ ఎంకరేజ్ చేస్తావా?" "అది, నీకూతురు ఎవడి స్కూటరు వెనకాలో ఎక్కి వెళ్తోంది తెలుసా? నేను కళ్ళారా చూశాను. ఇది నీవు ఇచ్చిన అలుసు. దాన్నెందుకూ పనకిరాకుండా చేస్తున్నావు."

చిన్నప్పటి నుంచి రామకృష్ణ, కల్యాణిల మధ్య ఆడపిల్ల విషయంలో ఎన్నో వాదనలు, దెబ్బలాటలు. "ఆడపిల్ల" అంటే కల్యాణికి కోపం. "ఏం, ఆడపిల్లయితే పాంటు వేసుకోకూడదని రూలుందా?" "షటిల్ ఆడితే తప్పేమిటి? ఆడేటప్పుడు షార్ట్స్ కాక మరేం వేసుకుంటారు?" మగపిల్లాడు వాడికి మోపెడ్ కొంటే, వాడికంటే ఇది దూరం వెళ్ళాలి, దీనికెందుకు కొనరు?" "క్లాస్‌మేట్స్ ఏదో సరదాకి ఇంటికి వస్తే తప్పేమిటి?" "వాళ్ళ బుర్రల్లో ఆడ, మగ తేడాలు పెట్టి మనమే పాడు చేస్తాం. ఫ్రెండ్స్‌కు ఆడమగ తేడాలెందుకు?" "దాని మోపెడ్ చెడిపోతే ఫ్రెండు స్కూటరెక్కి వస్తే కొంప మునిగిపోదు..."

ఇలా కూతురిని వెకేసుకువస్తూ "ఆడపిల్ల" అన్న తేడా లేకుండా పెంచింది. "ఇద్దరం ఉద్యోగాలు చేస్తూ వాళ్ళక్కావలసిన చదువులు చెప్పించలేమా? ఆడపిల్లయితే ఇంజనీరింగ్ చదవకూడదా? వాడికంటే దీనికే లెక్కలు బాగా వచ్చు. దాని చాన్సు మనం పాడు చెయ్యాలా" అంటూ పంతంగా కూతురుని ఇంజనీరింగ్‌లో పెట్టింది. చిత్ర, చైతన్య ఇద్దరికీ ఏడాది తేడా ఉండడంతో ఇద్దరూ కొట్టుకోకుండా రెండు సైకిళ్ళు, రెండు మోపెడ్లు, రెండు పుస్తకాల సెట్లు- ప్రతీది వంతులు లేకుండా చేసేది.

"నీ కర్మ, అలా గాలికి వదిలేసి నెత్తికెక్కించుకుంటున్నావు. అలా స్వేచ్ఛగా మగపిల్లలతో స్నేహాలు ఎంకరేజ్ చేస్తున్నావు. ఎప్పుడో అది కొంప ముంచుతుంది. అప్పుడేడుస్తావు." ఒకసారి బాయ్ ఫ్రెండ్స్‌తో అమ్మాయిలంతా పిక్నిక్‌కి వెడితే ఆ రోజు పెద్ద గొడవ చేశాడు రామకృష్ణ. "ఈ కాలం పిల్లలు తెలివైనవారు. వాళ్ళ లిమిట్స్ వాళ్ళకు తెలుసు. స్వేచ్ఛ ఇవ్వకపోతే దొంగచాటుగా తిరుగుతారు, అబద్ధాలు చెబుతారు. ఇలా అయితే ఫ్రాంక్‌గా మనతో అన్నీ చెబుతారు" అంటూ వాదించింది ఆరోజు. తల్లి సపోర్ట్‌తో చిత్ర చాలా బోల్డ్‌గా, ఎవరినీ లెక్కచెయ్యని రీతిలో ప్రవర్తించడం రామకృష్ణకి అసలు నచ్చేది కాదు. ఇప్పుడు భర్తకి చెపితే తానే కారణం అని దుమ్మెత్తి పోస్తాడు. అతను అనడం సరే ఎలాగూ తప్పదు. తాను ఇంత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇస్తే అది దుర్వినియోగం చేసిన కూతురిని క్షమించలేకపోతోంది కల్యాణి. ఇప్పటికీ జరిగిందాన్ని సమర్థించుకుంటున్న కూతురిని ఈ విషయంలో తేలిగ్గా తీసుకోలేదు. తానేం చేసినా తల్లి గుడ్డిగా సపోర్ట్ ఇవ్వదు అన్నది అర్థం కావాలంటే తాను రెండు మూడు రోజులు పట్టించుకోకుండా బింకంగా ఉంటే కాళ్ళబేరానికి వచ్చి ప్రాధేయపడితే, అప్పుడు చీవాట్లు పెట్టి డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలని నిర్ణయించుకుంది. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళేముందే భర్తకి ఈ విషయం చెప్పచ్చు. ఒకటి రెండు రోజులు ఊరుకుని కూతురు రియాక్షన్ గమనించాలని నిర్ణయించుకుంది కల్యాణి.

* * *

అర్ధరాత్రి మంచి నిద్రలో ఉన్న కల్యాణికి తనని

చిత్రాలు: నర్సిం



ఎవరో కుదిపి కుదిపి లేపుతుంటే చటుక్కున మెలకువ వచ్చింది. కళ్ళిప్పేసరికి చిత్ర ఏడుపు గొంతుతో, "మమ్మీ, మమ్మీ" అంటూ రహస్యంగా పిలుస్తోంది. చటుక్కున లేచి కూర్చుంది కల్యాణి. చిత్ర మొహం బెడ్ లైటు వెలుగులో పాలిపోయి ఉంది. భయంతో ఏడుస్తున్న కూతుర్ని చూసేసరికి దిగ్గున లేచి గదిలోంచి బయటికి వచ్చి చిత్ర గదివైపు నడిచింది. చిత్ర మంచం మీద లుంగ చుట్టుకుపోతూ, "మమ్మీ నొప్పి. మమ్మీ బ్లీడింగ్ అయిపోతోంది. డూ సమ్‌థింగ్." కడుపు పట్టుకు ఏడవసాగింది. ఆమె పక్కమీద, నైట్ గౌను నిండా రక్తం మరకలు.

కల్యాణి గుండె ఝల్లుమంది. "ఏం అయింది? ఏం చేశావు?" గాబరాగా కడుపు పట్టుకుని బాధతో మెలికలు తిరుగుతున్న చిత్రని అడిగింది. "ఏం చేశావే? ఏదన్నా మందు మింగావా?" భయంగా చూస్తూ అడిగింది.

మొన్న ఓ లేడీ డాక్టరు అబార్షన్ చేసింది. ఇవాళ సాయంత్రం నుంచి బ్లీడింగ్. ఇందాకటి నుంచి కడుపులో ఒకటే పోటు. బ్లీడింగ్ అలా అయిపోతోంది. మమ్మీ ఈ నొప్పి... చచ్చిపోతున్నాను... డూ సమ్‌థింగ్." ఏడవసాగింది బేలగా.

"ఏ డాక్టరు చేసింది? ఒక్కర్తివీ ఎందుకు వెళ్ళావు?" గాబరాగా అంది.

"నీవు ఏం చెప్పలేదు నాకు. నా ఫ్రెండ్ రవి పాపం తాను హజ్బెండ్‌నని చెప్పి వచ్చి నాకు హెల్ప్ చేశాడు, ఎక్కడో ఎవరో ఆ డాక్టరు ఉందంటే..."

"మాకు మొహం తెలియని ఎవరి దగ్గరకో వెళ్ళావన్నమాట." కోపంగా అంది కల్యాణి. అబార్షన్ సరిగా చేయలేదన్నది కల్యాణికి అర్థమైంది. ఇది ఇంక వాదులాడవలసిన టైము కాదని అర్థం అయి గబగబా రామకృష్ణని లేపడానికి వెళ్ళింది.

* * *

"ఇన్ కంప్లీట్ అబార్షన్. ఈ బ్లీడింగ్, ఇంత జ్వరం, కడుపులో పోట్లు- ఇవన్నీ ఇన్‌ఫెక్షన్‌కి సూచనలు. ఎక్కడపడితే అక్కడ ఊరూ పేరు లేని ఏదో చిన్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చేయించుకున్న ఫలం. ఈ కాలం పిల్లలు చదువుకునీ, తప్పు ఒప్పులు తెలుసుకోరు. తప్పు చేశాక చేసినదాన్ని సరిగా అయినా సరిదిద్దుకోరు." తల వాచేట్లు చీవాట్లు పెట్టి అప్పటికప్పుడు డి అండ్ సి చేసి అబార్షన్ పూర్తి చేసి, పెయిన్స్‌కి, ఇన్‌ఫెక్షన్స్‌కి ఇంజక్షన్లు ఇచ్చింది డాక్టరు.

"మీరు తల్లి అయివుండి పంతానికి పోయి అలా రెండు మూడు రోజులు వదిలేయాల్సింది కాదు. పిల్లలు తప్పు చేసినప్పుడు మనం కాకపోతే ఎవరాదుకుంటారు" అంటూ కల్యాణిని మెత్తగా మందలించింది. ఆవిడ తన కొలీగ్ ఆడపడుచు. ఇదివరకు పరిచయంతో కల్యాణి అక్కడికి వచ్చింది. ఆవిడ ముందు తానే తప్పు చేసినట్లు తల దించుకుంది.

ఆ రాత్రి సంగతి విని నిశ్చేష్టుడయ్యాడు రామకృష్ణ. అప్పుడు ఒక్కమాట కూడా మాట్లాడకుండా కారు తీసి నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్ళాడు. ఆ తర్వాతైనా కూతుర్ని పలకరించలేదు, మందలించలేదు. కల్యాణి ఏదో చెప్పబోయినా వినలేదు. ఆ రోజు నర్సింగ్ హోమ్‌లో ఉంచి మర్నాడు కూతుర్ని ఇంటికి తీసుకెళ్ళింది కల్యాణి.

"మీ డాడీ నిన్ను ఒకమాటా అనలేదు అంటే, ఆయన నీవు చేసిన పనికి ఎంత హర్ట్ అయ్యారో తెలుసుకో. ఆయన బాధ, అవమానం మనసులో దాచుకున్నారు. అంటే, మనల్ని క్షమించలేదన్నమాట. ఇంతకంటే ఆయన నిన్ను, నన్ను తిట్టినా బాగుండేది. ఆయనకి మొహం చూపించలేకపోతున్నాను." కల్యాణి కూతురికి పళ్ళరసం తెచ్చి ఇస్తూ అంది.

"సారీ మమ్మీ." చిత్ర తల వాల్చుకుని అంది. ఈ ఒక్క రోజులో ఆమె పొగరు, వగరు అన్నీ దిగిపోయినట్లు సౌమ్యంగా అంది. పాలిపోయి, కళ్ళకింద నల్ల చారలతో, మొహం పీక్కుపోయిన కూతురు



మొహం చూస్తే శారీరకంగా, మానసికంగా ఎంత బాధపడిందీ అర్థం అవుతోంది.

"చిత్రా నీ ఈ తప్పటడుగుతో నీవు స్వేచ్ఛను పోగొట్టుకున్నావు. నీపై అందరికీ నమ్మకం పోయేట్లు చేసుకున్నావు. ఇంక నీపై ఎన్ని ఆంక్షలు పెడతారో మీ డాడీ చూద్దువుగాని. నీవు ఏం చేసినా, ఎక్కడికి వెళ్ళినా, కాలేజీ నుంచి రావడం ఒక గంట ఆలస్యం అయినా అనుమానంగానే చూస్తాం. నిన్ను వెనకేసుకువచ్చే అవకాశం నాకు లేదు ఇప్పుడు."

చిత్ర ఏడవడం ఆరంభించింది. ఏడుపు మధ్య, "మమ్మీ, నేను కావాలని చెయ్యలేదు. ఆ సందీప్

చిత్ర మంచం మీద లుంగ చుట్టుకుపోతూ, "మమ్మీ నొప్పి. మమ్మీ బ్లీడింగ్ అయిపోతోంది. డూ సమ్‌థింగ్." కడుపు పట్టుకు ఏడవసాగింది. ఆమె పక్కమీద, నైట్ గౌను నిండా రక్తం మరకలు.

ఇంటికెడదాం అంటే సరదాగా వెళ్ళా. వాళ్ళ పేరెంట్స్ వాళ్ళు అంతా తిరుపతి వెళ్ళారని వెళ్ళాక తెలిసింది. ఏవో కబుర్లు చెప్పాడు. మ్యూజిక్ పెట్టాడు. డాన్సు అన్నాడు. జస్ట్ ఫర్ ఫన్ అన్నాడు. ఇదంతా కాలేజీ అబ్బాయిలు, అమ్మాయిలు అంతా చేస్తారన్నాడు. ఎవరెవరివో పేర్లు చెప్పాడు. ఒక్కసారికి ఏం అవదు, తప్పేమిటి... ఏదేదో అంటూ నన్ను మాటల్లో వశపరచుకున్నాడు. నాకూ ఏ మూలో ఎలా ఉంటుందో అన్న జస్ట్ ఇంక్విజిటివ్‌నెస్. ఇలా అవుతుందని అనుకోలేదు మమ్మీ. సేఫ్ పీరియడ్ ఫరవాలేదన్నాడు." ఏడుస్తూ అంది.

"హుఁ. చిత్రా, ఈ మగపిల్లలకి, ఈ వయసులో దృష్టి ఎంతసేపూ సెక్స్‌పైనే ఉంటుంది. బై హుక్ ఆర్ క్రూక్ ఆ అనుభవం పొందాలని ఆరాటపడే వయసు ఇది. ఈ యౌవన ప్రారంభంలో దీనికోసం ఉచితానుచితాలు మర్చిపోతారు. అబ్బాయిలతో స్నేహం చేసేటప్పుడు హద్దులు గీసుకోవాల్సింది అమ్మాయిలే. స్నేహాన్ని ఆకర్షణకి లోబడకుండా ఉంచుకోవడానికి అబ్బాయిలని గిరిగీసి దూరం ఉంచాలి. నిప్పు కాలడం దాని సహజ లక్షణం. దానికి దూరంగా ఉండాల్సింది మనం. మన పూర్వులు ఆడదానికిన్ని ఆంక్షలు ఎందుకు పెట్టారంటావు. నిప్పు దగ్గరకి వెడితే కాలేది ఆడదానికే. బాధ, హింస, అవమానం భరించాల్సింది ఆడదే కాబట్టి. నీతో ఎంజాయ్ చేసిన సందీప్ హాయిగా ఉన్నాడు.

కొన్ని క్షణాల తొందరపాటు వల్ల నీకు ఎంత కష్టం, నష్టం జరిగింది. నిన్ను ఎంత బాధ, అవమానాలకి లోనుచేసింది ఆ సంఘటన. మనం ఎంత మాడర్న్‌గా స్త్రీ పురుష సమానత్వం అని ఎన్ని మాటలు వల్లించినా ఈ ఒక్క విషయంలో మాత్రం మనం పురుషుల ముందు తల ఒగ్గాల్సిందే. ప్రకృతే పురుషుని పట్ల పక్షపాతం వహించి మనకు అన్యాయం చేసింది. ఇద్దరూ పాలు పంచుకున్న ఆనందంలో స్త్రీ మాత్రమే శిక్షకు గురి అవడం దేవుడు మనకిచ్చిన శాపం. ఈ బాధ, ఈ అవమానం మనం తప్పించుకోలేనిది."

చిత్ర గిల్టీగా చూసింది.

"చిత్రా నీకు నేను ఎప్పుడూ మగ పిల్లాడితో సమంగా 'స్వేచ్ఛ' ఇచ్చాను. స్వేచ్ఛ అంటే విచ్చలవిడితనం కాదు. నీవు చదువుకోవాలి. మంచి ఉద్యోగం చేసుకోవాలి. ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. ఏదైనా నిబ్బరంగా ఎదుర్కొనే మనస్థయిర్యం ఉండాలి. ఓ వ్యక్తిత్వం అలవరుచుకోవాలి. మగాడి కంటే మనం దేన్లోనూ తక్కువ కాదు అని నిరూపించాలి అన్నది నా ఉద్దేశం. స్వేచ్ఛకి నీవు విపరీతార్థం తీశావు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అంటే ఇష్టం వచ్చిన మగాడితో విచ్చలవిడిగా తిరగడం కాదు. అలా తిరిగితే ఏ సభ్య సమాజం ఊరుకోదు. సమాజానికి కొన్ని కట్టుబాట్లుంటాయి. ఆ కట్టుబాట్లు దాటితే ఎంత నవీన సమాజమైనా వేలెత్తి చూపి పరిహసిస్తుంది. ఆ యుగం నాటి కుంతి మొదలు నీవరకు ఇలాంటి అక్రమ సంబంధాలని ఏ సమాజమూ ఆమోదించదు. ఇప్పుడే కాదు, ఇంకో యాభై ఏళ్ళు గడచినా ఏ తల్లీ తన కూతుర్ని అబార్షన్‌కి తీసుకొచ్చానని అందరి ఎదుటా చెప్పగలదా! ఏ ఆడపిల్లా నేను అబార్షన్ చేయించుకున్నాను అని ఓపెన్‌గా చెప్పగలదా అంటే అనుమానమే! నిన్న నర్సింగ్ హోమ్‌లో చూసి ఆ ప్రసాదరావు భార్య ఆశ్చర్యంగా అడిగితే ఏదో గైనిక్ ప్రాబ్లమ్ అని అబద్ధం చెప్పాను. అది అబద్ధం అని నా మొహమే చెప్తుంది. రేపు ఈ వార్త మా ఆఫీసులో, నీ కాలేజీలో అందరికీ ఎలాగో తెలుస్తుంది. వారి అనుమానపు దృక్కులు, సానుభూతి వాక్యాల చాటున హేళన ఉంటుంది. ఇంతేకాదు, ఇది రేపు నీ పెళ్ళికి అవరోధం అవచ్చు. నీ అంతట నీవు ఎవరినన్నా చేసుకున్నా, సమయం వచ్చినప్పుడల్లా దెప్పడానికిది ఆయుధంగా వాడు కుంటాడు ఆ మొగుడనేవాడు."

చిత్ర మొహం కళ తప్పి నల్లబడింది. "మమ్మీ, నీవిన్ని అంటున్నావు. మా కాలేజీలో కొంతమంది అబ్బాయిలు, అమ్మాయిలు ఎలా తిరుగుతారో తెలుసా హోటళ్ళు, పిక్నిక్కులు అంటూ? అయామ్ ష్యూర్ దే ఆర్ హావింగ్ సెక్స్."

"ఎవరో ఏదో చేశారని నీవూ చెయ్యక్కరలేదు. పట్టుబడేవరకు అందరూ పవిత్రులే. ఈ ఫామిలీ ప్లానింగ్ మెథడ్స్ వచ్చాక ఎంత పవిత్రంగా ఉన్నా రన్నది ప్రశ్నార్థకమే. ఆపాటి తెలివి కూడా లేకుండా నీవు రొంపిలో దిగబడ్డావు. ఈ మాట నేను ఇంతవరకు ఎందుకు అనలేదో తెలుసా? ఫామిలీ ప్లానింగ్ యూస్ చేస్తూ బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరగచ్చు అని నేను సజెషన్ ఇచ్చినట్లవుతుందని. చిత్రా! ప్లీజ్ నీలాంటి అమ్మాయిలు విచ్చలవిడిగా తిరిగి మళ్ళీ 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని పెద్దలు భావించి, చరిత్ర పునరావృతం అయి ఆడదాన్ని మళ్ళీ నూరేళ్ళు వెనక్కు పంపేయకుండా చూడాల్సిన బాధ్యత ఈ తరం, ముందు తరాల అమ్మాయిల మీద ఉంది. 'పరవాలేదు, స్త్రీకి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఇచ్చినా దుర్వినియోగం చెయ్యదు' అన్న నమ్మకం సమాజానికి మీ యువతరం కలిగించాల్సిన బాధ్యత ఉంది."

కల్యాణి మాటలకి చిత్ర కళ్ళు వాల్చుకుంది. చిత్ర మళ్ళీ ఇలాంటి తప్పు చెయ్యదని, చేసేముందు పదిసార్లు ఆలోచిస్తుందన్న నమ్మకం కల్యాణికి కలిగింది. ■

# అంతః సంఘర్షణకు అక్షరరూపం

## అద్వితీయమైన కథాకథన నైపుణ్యంతో పాఠకులను ఆకట్టుకునే నవల



తపన
రచన: కాశీభట్ల వేణుగోపాల్
ప్రతులకు: వాహిని బుక్ ట్రస్ట్, 1-9-286/3, విద్యానగర్, హైదరాబాద్-500 044;
పేజీలు: 148.
వెల: రూ. 45/-

మల్లంపల్లి ధూర్జటి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), స్వాతి నవలల పోటీలో లక్ష రూపాయల బహుమతి పొందిన నవల ఇది. తెలుగులో చైతన్యస్రవంతి శైలిలో వచ్చిన బహుకొద్ది నవలలలో తపన ఒకటి. ఈ నవల మొత్తం ఒక సంపన్న వ్యాపారి, అతని గత స్మృతులు, అతని భార్య హైమవతి, వారిద్దరి మధ్య ఘర్షణ, హైమవతి చిన్నాన్న, కథానాయకుని స్నేహితుల, స్నేహితురాళ్ళ కుటుంబాల చుట్టూ తిరుగుతుంది. కాకపోతే హైమవతికి, కథానాయకునికి మధ్య వర్ణించినంత ద్వేషానికి నవలలో బలమైన కారణాలు కనిపించవు. మొత్తానికి చివరలో కథ సుఖాంతం చేశారు. ఎన్ని లోటుపాట్లు ఉన్నా వివాహ వ్యవస్థ చెక్కు చెదరకుండా ఉండడానికి సంతానం కూడా ఒక ప్రధాన కారణం. ఈ నవలలో కూడా తాము తల్లితండ్రులం కాబో తున్నాం అని తెలుసుకున్న తర్వాతనే హైమవతి దంపతులలో పరివర్తన మొదలవుతుంది. ఈ నవలలో కథకన్నా కథనానికి, అందుకు ఉపయోగించుకున్న కవితాత్మక భాషకు ప్రాధాన్యం ఎక్కువ.

> ఎప్పుడో ప్రాకృతిక శిష్ట నరాలని మీటితే ట్రాంక్విలైజర్ మత్తులో పక్కకి చేరుతుంది. నా ఫ్యాక్టరీ గొడవల్లో నేనూ, తన స్తబ్ధతలో తనూ. మళ్ళీ ఇద్దరం సంఘం దృష్టిలో చక్కటి భార్యాభర్తలం. - పుట: 19

ఉత్తమపురుషలో సాగిన ఈ నవలలో రచయిత అనేక అంశాలను స్పృశించారు. స్త్రీ, పురుష సంబంధాలను, మన హిపోక్రసీని చర్చకు పెట్టారు. లోపల ఒకటి పెట్టుకుని బయటకు ఒకటి ఎలా మాట్లాడతామో వివరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి తొడుక్కునే ముసుగును తొలగించి నిజ స్వరూపాన్ని బయటపెట్టారు. ఈ క్రమంలో నవల మనల్ని ఆత్మశోధనకు పురికొల్పుతుంది. తాత్త్విక చింతనలో ముంచి తేల్చుతుంది.

బాహ్య ప్రపంచం వేరు. అంతరంగ ప్రపంచం వేరు. ఇష్టమున్నా లేకున్నా బాహ్య ప్రపంచంలో కొన్ని కట్టుబాట్లకు కట్టుబడి ఉండాలి. అంతరంగంలో అలా కాదు. వ్యక్తి అంతఃప్రపంచానికి బాహ్య ప్రపంచంతో ఎప్పుడూ పేచీయే. ఈ ద్వంద్వాల మధ్య మనిషి నిరంతరం సతమతమవుతుంటాడు. మనసు సంకల్పవికల్పనాత్మకం కదా. మనసు ఈ క్షణంలో ప్రతిపాదించి మరుక్షణంలో ఉపసంహరించుకునే అంశాలను అంతరాత్మ ఎద్దేవా చేస్తుంటుంది. అది మనం చేసే ప్రతి పనినీ విశ్లేషిస్తుంది. అసలు ఒక పని చేయడానికి ముందే అందులోని తప్పొప్పులను తెలియజేసి హెచ్చరిస్తూ ఉంటుంది.

ఒక్కోసారి దాని మాట వింటాం. ఒక్కోసారి వినం. అయితే, దాని దగ్గర మనం నిజాలను కప్పిపుచ్చలేం. తపన నవలలో కథానాయకుడు తరచు ఈ ఆంతరంగిక ప్రపంచంలోకి, అందులోని జ్ఞాపకాల తోటలోకి వెళ్ళిపోతుంటాడు. అసలు నేను ఎవరిని అని తత్త్వచింతన చేస్తుంటాడు. ఉదాహరణకు, "బ్రతికే బ్రతుకును చూసి 'ఇది కాదు నా బ్రతుకు' అని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. ఇంకేదో తెలీని దానికోసం ఆరాటపడడాన్ని మోనోటనీ అని పేరు పెట్టుకుంటారు. అంతేకానీ, ఆ అశాంతికీ, నిస్పృహకూ మూలం తెలుసుకునే ప్రయత్నం మాత్రం చేయరు. ఆ అశాంతికి మూలం ఒక పారభౌతిక భావనన్న సంగతి చాలా మంది ఒప్పుకోరు" అంటారు రచయిత ఒక చోట.

వేణుగోపాల్ ఈ నవలా రచనలో తనకున్న మానసిక శాస్త్ర, తత్త్వ శాస్త్ర పరిజ్ఞానాన్నంతటినీ ఉపయోగించుకున్నారు. అంతేకాదు, ఆయనకు సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ, తెలుగు సాహిత్యంతో మంచి పరిచయం ఉంది. ఆయన ఈ నవలలో ఉపయోగించిన భాష, వర్ణనలు అందుకు తార్కాణం.

"ఈ నవలలో కథావస్తువు, పాత్రచిత్రణ, కథనశైలి, భాషా ప్రయోగం చాలా ప్రత్యేకమైనవి. దాంపత్య సంబంధాలు కథా వస్తువుగా మనకు చాలా నవలలు, కథలు వచ్చాయి. కానీ, ఈ నవలలో భార్యాభర్తల మధ్య ఉన్న సంబంధం ఇంతకుముందు ఏ తెలుగు నవల లోనూ చూసిన గుర్తు లేదు. అయితే, మొదటి నుంచి చివరి దాకా ఇదే శైలిలో ఉత్తమ పురుషలో కథానాయకుడి దృక్పథం నుంచి మాత్రమే కథను ఆవిష్కరిస్తూ రాసినవి బహు తక్కువ. రెండు దశాబ్దాల క్రితం హిమజ్వాల రాసిన వడ్డెర చండీదాసు తరువాత వచన రచనలో భాషను తనకిష్టమైన రీతిలో మైనంలా మలచుకోవడం మళ్ళీ ఈ రచయితలోనే కనిపిస్తుంది. చాలా కాలంగా స్తబ్ధంగా ఉన్న తెలుగు నవలా కాసారంలో ఉన్నట్లుండి విరుచుకుపడుతున్న ఉత్తుంగ తరంగాలు ఇతని నవలలు" అని ఈ నవలను మొదటి బహుమతికి ఎంపిక చేసిన జంపాల చౌదరి చక్కని కితాబునిచ్చారు.

"ఆధునిక జీవిత సంక్లిష్టతని అంత సంక్లిష్టంగానూ చిత్రించిన రచయిత తపన ఈ తపన. సరళ మార్గాలకే అలవాటుపడ్డ పాఠకుల సుప్త చైతన్యాలకి తలుపులు తెరిపించి, వారిని తనతో సమానంగా అంతరిక్షాలకీ, అధోలోకానికీ ఝరీవేగంతో పరుగులు పెట్టిస్తూ ఇబ్బంది పెట్టే శైలి తపనలో కనిపిస్తుంది. అలవాటు లేదు కనుక అలసట సహజం. ఈ నవల్లో సుఖాన్నీ... శాంతినీ చూపించే హామీలేం లేవు, మగతకీ, మెలకువకీ మధ్య మనిషిలోని కల్లోల కథనం తప్ప" అని రచయితను మెచ్చుకుంటూ జయప్రభ ఒక మొగిలిరేకు సమర్పించారు.

వేణుగోపాల్‌కు ఇది రెండవ నవల. దీనిని చదివిన తరువాత ఆయన మొదటి నవల నేనూ-చీకటీని చదవని వారికి చదివి తీరాలనే తపన మొదలవుతుంది. అదీ ఈ నవల ప్రత్యేకత. ■